విద్యుత్ బిల్లులు షాక్ కొడుతున్నాయి: టీడీపీ

విశాలాంధ్ర - భోగాపురం : విద్యుత్ బిల్లులు షాక్ కొడుతున్నాయని బిల్లులు కట్టలేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని మండల టీడీపీ అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ పేర్కొన్నారు. రాష్ట్రంలో పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ భోగాపురంలో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద కర్రోతు సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టి మాట్లాడారు. జగన్‌రెడ్డి ప్రభుత్వం నాలుగేళ్లలో 7సార్లు విద్యుత్ చార్జీలు పెంచి, వినియోగదారులపై రూ. 17వేల కోట్ల భారం మోపిందని మండిపడ్డారు. 37,500 కోట్లు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అప్పులు తేవడంతో మొత్తం రూ.57,188 కోట్ల భారం వినియోగదారులపై పడిందన్నారు. అయినా విద్యుత్ సేవలు మెరుగుపరచకుండా అప్రకటిత కోతలు విధిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో దాసరి అప్పలస్వామి, ముంజేరు ఎంపీటీసీ విడుగు వెంకటసత్యం, లెంక రామనార్సు, గరే వెంకటరమణ, నంద ముకుందా, బొద్ద హరిబాబు, సిహెచ్ రామకృష్ణ, యువ నాయకులు రామారావు, లోకేష్, సోమిరెడ్డి, వర్మ రాజు, తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ జాతీయ పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు మేరకు మంగళవారం డెంకాడ గ్రామంలో గల విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ కంది చంద్ర శేఖర రావు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి పేదవాడి పై ధరల భారం పెరుగుతూనే ఉందని విద్యుత్ చార్జీలు, బస్ చార్జీలు, నిత్యవసర వస్తువుల ధరలు పెంచుతూనే ఉన్నారని రానున్న రోజుల్లో ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డెంకాడ మండలం మాజీ ఎంపీపీ, మండల టీడీపీ అధ్యక్షులు భాస్కరరావు, మాజీ ఏఎంసీ వైస్ ఛైర్మన్ కాగితాల సత్యనారాయణ రెడ్డి, డెంకాడ మండలం ఉపాధ్యక్షులు పడాల చిన్నారావు, సెక్రటరీ కొయనేని రమణ, మాజీ నీటి ఆనకట్ట ఛైర్మెన్ కలిదిండి రంగరాజు, మాజీ ఎంపీటీసీ చలుమూరి మహేశ్ ఆదిబాబు, నాగవంశపు కన్వీనర్ ముని పైడయ్య, గ్రామ పార్టీ అధ్యక్షులు సబ్బవరపు పైడినాయుడు పాల్గొన్నారు.

పూసపాటిరేగ: ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్య క్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు మేరకు మంగళవారం ఉదయం మండల పార్టీ అధ్యక్షుడు మహంతి శంకర్రావు ఆధ్వర్యంలో కొప్పెర్ల గ్రామంలో గల విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ, పార్లమెంటు కమిటీ, రాష్ట్ర కమిటీ నాయకులు,తదితర నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

విశాలాంధ్ర - గంట్యాడ: మండలంలోని లక్కడాం గ్రామానికి చెందిన కిలపర్తి రామకృష్ణ (33) కరెంట్ షాక్ తగిలి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. గంట్యాడ ఎస్సై కిరణ్ కుమార్ నాయుడు అందించిన వివరాలు ప్రకారం మృతుడు తన ఇంట్లో మోటారు చెడి పోవడంతో బాగు చేస్తానని వెళ్లి మోటార్‌ను పట్టుకోవడంతో కరెంట్ షాక్ తగిలి అపస్మారక స్థితికి చేరుకోవడంతో విజయనగరం తిరుమల ఆసుపత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడుకి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తండ్రి నారం నాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గంట్యాడ పోలీసులు కేసు నమోదు చేశారు.

సి.ఎస్.ఆర్. నిధులతో మౌళిక సదుపాయాలు: కలెక్టర్

విశాలాంధ్ర - విజయనగరం : జిల్లాలోని పారిశ్రామిక సంస్థలు తమ లాభాల నుంచి కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ఖర్చుచేసే నిధులతో జిల్లాలో సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌళిక వసతుల కల్పనకు ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ ఆదేశించారు. పరిశ్రమలు ఖర్చుచేసే సి.ఎస్.ఆర్. నిధులను ఈ కార్యక్రమాలకే వినియోగించేలా ఆయా యాజమాన్యాలతో సంప్రదించాలని పరిశ్రమలతో సంబంధాలు నెరపే శాఖల్ని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని పరిశ్రమలకు సంబంధించిన శాఖల అధికారులతో కలెక్టర్ ఒక సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా ఆసుపత్రుల్లో ఆపరేషన్ థియేటర్లు, హాస్టళ్లు, పాఠశాలల్లో మరుగుదొడ్లు ఇతర వసతులు కల్పించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పరిశ్రమలు తమకు వచ్చే లాభాల నుంచి 2 శాతం నిధులను సి.ఎస్.ఆర్. కింద వినియోగించాల్సి వుంటుందని, ఆ నిధులను సమీకరించే లక్ష్యంతో జిల్లా స్థాయిలో ఒక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు కలెక్టర్ చెప్పారు. ముఖ్య ప్రణాళిక అధికారి కన్వీనర్‌గా వుండే ఈ కమిటీలో పరిశ్రమల జిల్లా అధికారి, కాలుష్య నియంత్రణ మండలి జిల్లా అధికారి, ఏపిఐఐసి జోనల్ మేనేజర్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, కార్మిక శాఖ అధికారులు సభ్యులుగా వుంటారని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ముఖ్య ప్రణాళిక అధికారి పి.బాలాజీ, కాలుష్య నియంత్రణ మండలి ఇ.ఇ. సుదర్శనం, పరిశ్రమల జిల్లా అధికారి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

సేవే పరమావధిగా వాలంటరీ వ్యవస్థ: ఎమ్మెల్సీ రఘురాజు

విశాలాంధ్ర - శృంగవరపుకోట: రాష్ట్రంలో సేవే పరమావధిగా సాగుతున్న వ్యవస్థ వాలంటీర్లు అని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. ఎస్.కోట మండల పరిషత్ కార్యాలయంలో ఎస్.కోటలోని 1, 4, 5 గ్రామ సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న పలువురు వాలంటీర్లకు సేవా వజ్ర, సేవా మిత్ర, సేవా రత్న అవార్డులను మంగళవారం సాయంత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వాలంటీర్లు అనే గొప్ప వ్యవస్థ నడుస్తోందని, రాష్ట్రంలోని గ్రామ వాలంటీర్ వ్యవస్థ వైపు ఇప్పుడు దేశం మొత్తం చూస్తోందని గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగనన్న వివక్ష, అవినీతికి తావులేకుండా, కుల మత రాజకీయాలను పట్టించుకోకుండా ఒక వ్యవస్థ కోసం కలగన్నారని, రాష్ట్రంలో వలంటీర్ వ్యవస్థ ద్వారా ఆ కల సాకారమైందని వెల్లడించారు. వాలంటీర్ వ్యవస్థ ద్వారా 33 రకాల సేవలను ప్రతీ ఇంటికి అందిస్తున్నారని, రాష్ట్రం మొత్తంమీద 2 లక్షల 60 వేలమంది వాలంటీర్లు, లక్షల

మందికి పైగా లబ్ధిదారులకు సేవలు అందించేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.పి సండి సోమేశ్వరరావు, జెడ్పీటీసీ మమ్ములూరి వెంకటలక్ష్మి, వైస్ ఎం.పి.పి ఇందుకూరి సుధారాజు, ఎస్.కోట సర్పంచ్ జి.సంతోషికుమారి, ఎం.పి.టి.సిలు దార గిరి, వాకాడ సింహాచలం, మజ్జి దేవి, కో-ఆప్షన్ మెంబర్ షేక్ బషీర్, జె.సి.ఎస్ కన్వీనర్ కె.వెంకటరావు, నాయకులు గంగరాజు, సతీష్, అర్జున్, సూరి అప్పారావు, రమణ, ఎంపీడీఓ శేషుబాబు పాల్గొన్నారు.

వాలంటీర్లే సంక్షేమ సారధులు
ఎమ్మెల్యే శంబంగి

విశాలాంధ్ర - బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేద ప్రజల చెంతకు చేర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్న వాలంటీర్లే సంక్షేమ సారధులని స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మంగళవారం కళాభారతి ఆడిటోరియంలో మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళి కృష్ణారావు అధ్యక్షతన వాలంటీర్లకు వందనం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కులమత రాజకీయాలకు అతీతంగా 98.5 శాతం హామీలను నేరవేర్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ చెలికాని మురళీకృష్ణ, బుడా ఛైర్మన్ ఇంటి పార్వతి, గోపాలరావు, టౌన్ జేసిఎస్ కన్వీనర్ రేజేటి ఈశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గాలమ్మ పండగ
పోటెత్తిన భక్తజనం

విశాలాంధ్ర - జామి: మండలంలోని అన్నమరాజుపేట గ్రామ దేవత శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి పండగ అత్యంత వైభవంగా జరిగింది. సోమవారం తొలేళ్ళ ఉత్సవం జరగగా మంగళవారం పెద్ద పండుగను నిర్వహించారు. గ్రామంలోని అమ్మవారి ఆలయం నుంచి ప్రధాన రహ ధారు లలో రథాన్ని గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, విచిత్ర వేషధారణలో అందరిని ఆకట్టుకున్నాయి .మంగళవారం రాత్రి అటు సీతానగరంలోనూ ఇటు అన్నమరాజుపేటలోనూ ప్రత్యేక డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమాలు నిర్వహించారు. జాతరను నిర్వాహ కమిటీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని జరిపించడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. పోలీస్ బందోబస్తును భారీగా మోహరించారు .

జేవీకే స్టాక్ పాయింట్‌ను డిప్యూటీ డీఈఓ పరిశీలన

విశాలాంధ్ర - తెర్లాం /బాడంగి: మండలంలో జగనన్న విద్యాకానుక స్టాక్ పాయింట్‌ను డిప్యూటీ విద్యా శాఖాధికారి ఎన్.తిరుపతి నాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా జెవీకే శాంపుల్ కిట్‌ని పరిశీలించారు. సిఆర్పీ, పిటిఐ, ఐఈఆర్పిలకు పాఠశాల కిట్ల తయారీపై తగు సూచనలు ఇచ్చారు. ఈ సందర్శనలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిద్ధాంతం త్రినాధరావు, ఏపీఎం భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. టెన్త్ ఫెయిల్ విద్యార్థులకు జరుగుతున్న ప్రత్యేక తరగతులను పరిశీలించి తగు సూచనలు సలహాలు ఇచ్చారు.

స్వయం సహాయక సంఘ సభ్యుల ఖాతాలకే వైయస్సార్ ఆసరా

విశాలాంధ్ర - గుర్ల: మండల కేంద్రంలో గుర్లలో మంగళవారం జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మహిళ స్వయం సహాయక సంఘ సభ్యులు ఇళ్లకు వెళ్లి వారు బ్యాంక్ ఖాతాలో ఆసరా నిధులు జమ అయినట్లు స్వయంగా నిర్ధారించుకొని సంఘ సభ్యులతో సెల్ఫీ దిగారు. ఆర్థికంగా మహిళలు బలోపేతం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి పొట్నూరు సన్యాసి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి సూర్యనారాయణ రాజు, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైయస్సార్ క్రాంతి పథకం పిడి కళ్యాణ్ చక్రవర్తి, ఏరియా కోఆర్డినేటర్ సీతారామయ్య, ఏపీఎం నారాయణరావు, గ్రామ వైసిపి నాయకులు ప్రసాద్, సీతారాం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా చల్లని మజ్జిగ, చెరుకు రసం పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. మంగళవారం కస్పా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నగరంలోని రాజారావు మేడ సమీపంలో ఉచితంగా చెరుకు రసం పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆమె.. స్వయంగా వాహన చోదకులకు, పాదచారులకు చెరుకు రసం పంపిణీ చేశారు. సుమారు రూ.50 వేలు వెచ్చించి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉచితంగా ప్రజలకు చెరుకు రసం పంపిణీ చేస్తున్నామని సంఘం అధ్యక్షులు వెత్స శ్రీనివాసరావు, కార్యదర్శి ముత్యాల నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి కోలగట్ల కామేష్, పలివెల శ్రీనివాసరావు, కాపుగంటి రమేష్, ముత్యాల శ్రీనివాసరావు, అక్షింతల సతీష్, కాపుగంటి రామకృష్ణ, గ్రంధి సూరి, ఎం. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: బుధవారం నుండి ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయని, జూన్ 1వ తేదీ వరకు మొత్తం 45 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆర్ఐఓ ఎం.ఆదినారాయణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షల్లో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని సంబంధిత అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 30,811 మంది విద్యార్థులు హాజరుకానున్నారని వీరిలో ప్రథమ సంవత్సరం 18,180 కాగా, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 12,631 మంది ఉన్నారన్నారు. పరీక్షా కేంద్రాలకు అరగంట ముందే హాజరు కావాలని ఒక్క నిమిషం ఆలస్యమైనా ఉపేక్షించేది లేదన్నారు. పరీక్షా పత్రాల కోసం 30 స్టోరేజ్ పాయింట్లు ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి 12 వరకు ద్వితీయ సంవత్సరం 2.30 నుండి 5.30 వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మారుమూల ప్రాంత విద్యార్థుల కొరకు ఏపీఎస్ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు.

పైడిమాంబకు బూర్లు నైవేద్యం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఉత్తరాంధ్ర కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారికు మంగళవారం ప్రీతికర రోజు కావడంతో బూర్లు నైవేద్యంగా సమర్పించారు. ఉదయం 4 గంటలకు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కేఎల్ సుధారాణి ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించి పూలంకరణ చేశారు. ఆలయ పూజారి బంటుపల్లి వెంకట్రావు, అర్చకులు ఏడిద వెంకటరమణ సుదూర ప్రాంతాల నుండి విచ్చేసిన భక్తులకు పూజలు నిర్వహించారు. ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సీనియర్ అసిస్టెంట్ ఏడుకొండలు పటిష్ట చర్యలు చేపట్టారు.

గంజాయితో యువకుడు అరెస్టు

విశాలాంధ్ర - శృంగవరపుకోట: ఎస్.కోట రైల్వే జంక్షన్ వద్ద విశాఖ-అరకు ప్రధాన రహదారిపై ఏజెన్సీ డుంబ్రిగుడ మండలానికి చెందిన వంతల ఆనందరావు అనే యువకుడు 10 కేజీల గంజాయితో పట్టుబడ్డాడని, నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్.ఐ జె.తారకేశ్వరరావు మంగళవారం సాయంత్రం తెలిపారు. నిందితుడు వద్ద నుండి గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామని చెప్పారు. ఎస్.ఐ వెంట హెచ్టీటీ పప్పు హరి, వీఆర్వో, పోలీసులు ఉన్నారు.

29న జంఝావతి ప్రాజెక్టు ఆయకట్టు రైతుల సదస్సు

విశాలాంధ్ర - గరుగుబిల్లి/బెలగాం : ఈనెల 29వ తేదీన పార్వతీపురం ఎన్జీవో కార్యాలయంలో ఆయకట్టు రైతుల సదస్సును ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తుందని సదస్సులో ప్రస్తుత పాలకుల వైఖరిపై చర్చించడం తదుపరి కార్యాచరణ రూపొందించుటకు పలు అంశాలపై చర్చించడం జరుగుతుందని, సదస్సుకు ఆయకట్టు రైతులు యావన్మంది కదలి రావాలని సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1976లో 13.50 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ప్రారంభించిన జంఝావతి నదిపై సాగునీటి ప్రాజెక్ట్ పనులు సకాలంలో పూర్తి కాకపోవడంతో నేటికీ 120 కోట్లు ఖర్చుపెట్టినా కనీసం 9వేల ఎకరాలకు కూడా సాగు నీరివ్వలేని దీనస్థితిలో ఉందని అన్నారు. దీనిపై ఆయకట్టు రైతులను ఐక్యం చేస్తూ మంగళవారం సంఘ జిల్లా అధ్యక్షులు వెలగాడ శ్రావణ్ కుమార్, సంఘం నాయకులు వెలమల సత్యనారాయణ, ఈవి నాయుడుతో కూడిన ప్రతినిధి బృందం పార్వతీపురం మండలం అడ్డాపుశీల, గరుగుబిల్లి మండలం కొంకి డివరం గ్రామ సర్పంచ్ అల్లు అప్పలనాయుడు ఆయా గ్రామాల రైతులతో కొంకిడివరం, సీతారాంపురం, ఉల్లిభద్ర గ్రామాలలో కాలువలను పరిశీలన చేశారు. జగనన్న పాదయాత్ర సందర్భంగా అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి ప్రాధాన్యత జంఝావతి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినప్పటికీ పరిష్కారం కాలేద న్నారు. ఆయా గ్రామాల రైతులు, గ్రామ వైస్ ప్రెసిడెంట్ బడే బుజ్జి, బడే త్రినాధరావు, చీకటి గంగు నాయుడు, బొజ్జ భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

సవర భాషా ఉపాధ్యాయులను రెన్యూవల్ చేయాలి
సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జీవన్న

విశాలాంధ్ర - కురుపాం: సవర భాషా ఉపాధ్యాయులను రెన్యూవల్ చేసి, గిరిజన విద్యార్థుల డ్రాపౌట్స్ తగ్గించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న డిమాండ్ చేశారు. కురుపాం మండలం మొండింఖల్‌లో సవరభాషా ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే సవర భాషా విద్యా వాలంటీర్ల ఉపాధ్యాయులను రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేశారు. మన్యం జిల్లా ఐటీడీఏ పరిధిలో 176 మంది సవర మాతృభాషా ఉపాధ్యాయులు విద్యా బోధకులుగా ఉన్నారని, గత సంవత్సరం ప్రభుత్వం రెన్యూవల్ చేయడం వలన విద్యార్థుల సంఖ్య బాగా పెరిగిందని, మంచి ఉత్తీర్ణత స్థాయిలో నిలిచారని కాని, ఈ విద్యా సంవత్సరం ఎటువంటి రెన్యూవల్ నోటీ సులు ప్రభుత్వం ఎస్.పి.డీ, ఐటీడిఏ అధికారులు జారీ చేయక పోవడంతో గిరిజన విద్యార్థుల డ్రాపౌట్స్ సంఖ్య భారీగా పెరుగుతుందని, దాని వలన భవిష్యత్తుతో గిరిజన విద్యా కనుమరు గయ్యే పరిస్థితి ఏర్పడితుందని అన్నారు. వెంటనే మన్యం జిల్లా వ్యాప్తంగా ఉన్న 176 సవర మాతృభాషా ఉపా ధ్యాయులందరిని రెన్యూవల్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్య వర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, జిల్లా సమితి సభ్యులు పువ్వుల ప్రసాద్ మండంగి సింగన్న, పీ.మోహన రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల బాదుడుపై టీడీపీ నిరసన

విశాలాంధ్ర - సీతానగరం: పెరిగిన విద్యుత్ చార్జీలని తగ్గించాలని, విద్యుత్ సరఫరా సక్రమంగా చేయాలని కోరుతూ విద్యుత్ కార్యాలయం ముందు మంగళవారం మండల టీడీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కొల్లి తిరుపతిరావు, రౌతు వేణుగోపాల్నాయుడు ఆధ్వర్యంలో అప్పయ్యపేట వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాల హరిగోపాల్, బుడితి శ్రీనివాసరావు, సబ్బాన శ్రీనివాసరావు, కొట్నాన రామకృష్ణనాయుడు, ఉడమల సూర్య నారాయణ, పైల నాగభూషణరావు, గరికయ్య సర్పంచులు జొన్నాడ తేరేజమ్మ, వాకాడ పారినాయుడు, మూడడ్ల వెంకట నాయుడు, పెంట సత్యంనాయుడు, కొల్లి సురేష్, దాసరి సింహాచలం, జక్కు ఫకీరు నాయుడు, మూడడ్ల రామకృష్ణ, తాన్న సత్యనారాయణ, బొత్స వెంకట నాయుడు, నడిమింటి ధనుంజయ నాయుడు, సబ్బాన జగన్నాథం, బొమ్మినేని లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

ఈవ్ టీజింగ్ చేయరాదు: దిశ ఎస్ఐ సంతోషి



విశాలాంధ్ర - పార్వతీపురం: పట్టణంలో ఉన్న పార్కుల్లో, బహిరంగ ప్రదేశాల్లో ఈవ్‌టీజింగ్ జరగకుండా ఉండేందుకు ముందస్తుగా పట్టణంలో ఉన్న పార్కులను సందర్శిస్తున్నట్లు దిశా ఎస్ఐ సంతోషి తెలిపారు. మంగళవారం స్థానిక బెలగాం చర్చి వీధిలో ఉన్న పార్కును ఆమె సందర్శించి అక్కడ సందర్శకులతో మాట్లాడారు. ఆడపిల్లల పట్ల ఏ ఒక్కరూ అసభ్యకరంగా ప్రవర్తించరాదని అన్నారు. ఆమెతోపాటు ఒక మహిళా కానిస్టేబుల్, ఒక హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్ వున్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

విశాలాంధ్ర - సీతంపేట: మండలం మెట్టుగూడ గ్రామ సమీపంలో సీతంపేట నుండి కొత్తూరు వైపు వెళ్తున్న మెట్టుగూడ గ్రామానికి చెందిన సవర మంగయ్య (55) రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొని గాయపడ్డారు. సీతంపేట ఆసుపత్రికి వైద్య సేవలు నిమిత్తం తీసుకువెళ్లి అనంతరం కుటుంబ సభ్యులు సీతంపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో సబ్ ఇన్‌స్పెక్టర్ నీలకంతరావు దర్యాప్తు చేసి కేసు నమోదు చేశారు.

ఎస్పీని కలిసిన సామల

విశాలాంధ్ర - బెలగాం: పార్వతీపురం మన్యం జిల్లా నూతన ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను ఎపి ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎస్పీని సోమవారం వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి, యూనియన్ డైరీని అందజేసి శుభాకాంక్షలు తెలియజేసినట్లు సామల తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ ఎస్టీ వర్గాల సమస్యలు పోలీస్ శాఖ పరంగా ఏమైనా ఉంటే, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్పీ తమకు తెలియజేసినట్లు సామల పేర్కొన్నారు.

పవన్‌కళ్యాణ్‌ను కలిసిన గేదెల

విశాలాంధ్ర - మక్కువ: జనసేన పార్టీ మండల అధ్యక్షులు గేదెల రిషవర్ధన్ హైదరాబాదులో అధినేత పవన్ కళ్యాణ్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. మండలంలో గత కొన్ని దశాబ్దాలుగా ఉన్న అనేక సమస్యల గురించి వివరించారు. ముఖ్యంగా రోడ్లు, తాగునీటి సమస్య, డ్రైనేజీ సమస్యలు, గృహ నిర్మాణ సమస్యలు ఉన్నాయని వివరించారు. యువతకు జనసేన పార్టీ కొండంత అండగా ఉంటుందని పవన్ భరోసా ఇచ్చారు.

పది ప్రత్యేక తరగతి కేంద్రాన్ని డీడీ పరిశీలన

విశాలాంధ్ర- సీతంపేట: జూన్ 2వ తేదీ నుండి 10వ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో 10 పరీక్షలు తప్పినటువంటి విద్యార్థులకు అడ్డుబంగి ఆశ్రమ పాఠశాలలో ప్రత్యేక తరగతి శిక్షణ కేంద్రా లను నిర్వహించగా పార్వతీపురం మన్యం ఉప సంచాలకులు బి. సూర్య నారాయణ పరిశీలించారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉత్తీర్ణత సాధిం చాలని తెలియజేశారు. అనంతరం శిలగాం, అక్కన్నగూడ, లోవ గూడ జిపి ఎస్ పాఠశాలల్లో జరుగుతున్నటువంటి నాడు నేడు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యుఓ మంగ వేణి, ప్రధానోపాధ్యాయులు నారాయుడు, ఉమా వాణి పాల్గొన్నారు.

పట్టణంలో తాగునీరు సమస్య పరిష్కరించాలి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: పట్టణంలో త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం పట్టణానికి చెందిన వరువు మహిళలు మున్సిపల్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. అనంతరం కమిషనర్ అప్పలనాయుడుకి, డి.ఈ నర్సింగరావుకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, జిల్లా కమిటి సభ్యులు వి.ఇందిరా, గొర్లి వెంకటరమణ, పట్టణ కమిటి సభ్యులు పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు, సంచాన ఉమా మాట్లాడుతూ పార్వతీపురం మున్సిపాలిటీ గ్రేడ్ వన్ అయినప్పటికీ జిల్లా కేంద్రంగా అవతరించి సుమారు సంవత్సరం అయినప్పటికీ పట్టణంలో కుళాయిల ద్వారా మంచినీళ్లు ఇచ్చే పరిస్థితి లేదని అన్నారు. పట్టణంలో ఇప్పలపోలమ్మ, ఎర్రకంచెమ్మ,బంగారమ్మతల్లి పండగలు ఈనెల 28, 29, 30 తేదీలలో జరుగుతాయని వెంటనే మంచినీటి సమస్య పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం పట్టణ నాయకులు గెద్ద తులసి, పెద్దలు, మహిళలు, యువత, ప్రజలు పాల్గొన్నారు.

పార్వతీపురం మన్యం

మృతుని కుటుంబానికి చెక్కు అందజేత

విశాలాంధ్ర - పార్వతీపురం: గతనెల ఏప్రిల్ 24న దురదృష్టశాత్తు రోడ్డు ప్రమాదంలో మరణించిన పిన్నింటి లక్ష్మి కుటుంబానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సేకరించిన విరాళం 5లక్షల, 44వేల4వందలరూపాయల చెక్కును జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ చేతులమీదుగా మంగళవారం అందజేసారు. తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంఎల్‌హెచ్‌పిగా విధులు నిర్వహించిన పిన్నింటి లక్ష్మి విధులు నిర్వహించి తిరుగు ప్రయాణంలో ద్విచక్రవాహనంపై వస్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సంగతి తెలిసిందే. దీంతోజిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగన్నాథం, ఆర్‌బిఎస్‌కె అధికారి భాస్కరరావు, జిల్లా ఏపి ఎన్జీఓ అధ్యక్షులు జి వి ఆర్ ఎస్ కిషోర్, వైద్య అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టరు రఘు, సెక్రెటరీ డాక్టర్ వినోద్ సిహెచ్ఓ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్.జగదీష్ కుమార్, రాజేశ్వరి ఇంద్రాణీ, జాకబ్ పానల్ మెంబర్స్ అంతా కలిసికట్టుగా రూ.5,44,400/- లు డొనేషన్ వసూలు చేశారు. ఈ మేరకు మృతురాలి తల్లి పిన్నింటి పుష్పకు అందించారు.

దీప్తి ఇంగ్లీష్ మీడియం స్కూల్ సిల్వర్ జూబ్లీ వేడుకలు

విశాలాంధ్ర - సాలూరు టౌన్: ఉన్నతమైన విద్య అందిస్తూ ఏకైక ఉన్నతమైన పాఠశాలగా దీప్తి ఇంగ్లీష్ మీడియం స్కూల్ నిలిచిందని మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ వంగపడిన అప్పలనాయుడు, ఎంఈఓ రాజశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం సాలూరు పట్టణం శ్రీ కోదండరామ కళ్యాణ మండపం మెంటాడ వీధిలో దీప్తి ఇంగ్లీష్ మీడియం స్కూల్ రాంబాబు, నాగేశ్వరరావు, కాశీ మాస్టారు ఆధ్వర్యంలో సిల్వర్ జూబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ వంగపందు అప్పలనాయుడు, ఎంఈఓ రాజశేఖర్, గిరిజన న్యాయ సలహాదారుడు రేగు మహేశ్వరరావు పాల్గొన్నారు. గత 25 సంవత్సరాలుగా దీప్తి ఇంగ్లీష్ మీడియం స్కూల్ నిరంతరం కృషి చేస్తూ ఉన్నతమైన విద్యను అందిస్తుందన్నారు. అనంతరం పదో తరగతి సాధించిన విద్యార్థులకు అలాగే ఆ పాఠశాల టీచర్లకు సిబ్బందికి సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లీన్ పార్వతీపురానికి సహకారం అందిస్తా: కలెక్టర్

విశాలాంధ్ర - పార్వతీపురం: క్లీన్ పార్వతీపురం కార్యక్రమానికి తన సహకారం ఉంటుందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. జట్టు ఆశ్రమ నిర్వాహకులు పద్మజ ఆధ్వర్యంలో క్లీన్ పార్వతీపురంవాలంటీర్లు మంగళవారం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జట్టు ఆశ్రమ నిర్వాహకులు, స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన గ్రూప్ 1ఉద్యోగి పద్మజ మాట్లాడుతూ క్లీన్ పార్వతీపురం కోసం చేపడుతున్న కార్యక్రమాలను జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో క్లీన్ పార్వతీపురం సభ్యులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సీజన్‌కి విత్తనాలను సిద్ధం చేయాలి

విశాలాంధ్ర - పార్వతీపురం: వచ్చే ఖరీఫ్ సీజన్లో రైతులకు ఇబ్బంది లేకుండా డిమాండ్ మేరకు ప్రతీ రైతుభరోసా కేంద్రాల్లో సరిపడా విత్తనాల పంపిణీకి ముందస్తుగా జూన్ 3,లోగా సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. జిల్లాకలెక్టర్ కార్యాలయం నుండి వ్యవసాయ, అనుబంధశాఖల మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల ఖరీఫ్ సీజన్ తొలకరి పనులు ప్రారంభంకానున్న దృష్ట్యా ప్రతీ రైతు భరోసా కేంద్రాల నుండి రైతుల డిమాండ్ మేరకు విత్తనాలను, ఎరువులను ముందస్తుగా సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. మొక్కజొన్న రైతులు పండించిన పంటకు జూను నెల మొదటి వారంలోగా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సుధారాణి, జిల్లా పశు సంవర్ధకశాఖఅధికారి ఆరిక ఈశ్వరరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి వి.తిరుపతయ్య, జిల్లా ఉద్యానవన అధికారి కే.వి.ఎస్.ఎన్.రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలకు నిరసనగా టీడీపీ ధర్నా

విశాలాంధ్ర - శృంగవరపుకోట: మండలంలోని పోతనాపల్లిలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ఆధ్వర్యంలో కరెంట్ కోతలు, విద్యుత్ ఛార్జీల పెంపులపై నిరసన కార్యక్రమాన్ని టీడీపీ శ్రేణులు మంగళవారం చేపట్టాయి. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కోళ్ల మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఐదేళ్లలో ఎప్పుడు విద్యుత్ చార్జీలు పెంచలేదని, కరెంటు కోతల్లేవని స్పష్టం చేశారు. చంద్రన్న.. జగన్ చేతిలో పెట్టిన విద్యుత్ ప్లాంట్లను సక్రమంగా నడుపుకుంటే ఈ సంక్షోభం ఉండేది కాదని అన్నారు. జగన్ రెడ్డి లూటీ, అవినీతి కారణముగా విద్యుత్ వినియోగదారులపై రూ.57,188 కోట్ల భారాన్ని మోపారని అన్నారు. క్విడ్ ప్రోకోలకు ప్రభుత్వ విద్యుత్ సంస్థల్లో వాటి సామర్థ్యం మేరకు ఎందుకు ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తి చేయడం లేదు? జగన్ బినామీ ప్రైవేటు విద్యుత్ సంస్థల వద్ద కమిషన్లు, అధిక రేట్లకు విద్యుత్తు కొనుగోలు, కమిషన్ కోసం కృత్రిమ కొరత సృష్టిస్తూ బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు గాను రూ.12 వేల కోట్లపైగా ఖర్చు చేశారని ఆరోపించారు. అవినాష్ రెడ్డి బినామీ కంపెనీ షిర్డీ సాయి ఎలక్ట్రికల్ వద్ద రూ.60 వేలు ధర ఉన్న ట్రాన్స్ ఫార్మర్ కు రూ.లక్ష ముప్పై వేలకు ఎందుకు కొంటున్నారని మాజీ ఎమ్మెల్యే ప్రశ్నించారు. 73 ఏళ్ల రాష్ట్ర చరిత్రలో 20 మంది ముఖ్యమంత్రులు 7 వేల మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తే, ఒక్క చంద్రబాబు నాయుడు 15 వేల మెగావాట్లు ఉత్పత్తి చేశారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో లోటును అధిగమించి, కోతలు లేని 24 గంటలు నాణ్యతమైన విద్యుత్ అందించిన ఏకైక ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని స్పష్టం చేశారు. నిరసన కార్యక్రమంలో టీడీపీ పార్టీ మండల అధ్యక్షులు జి.ఎస్.నాయుడు, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, మాజీ వైస్ ఎంపీపీ నానిగిరి రమణాజీ, మాజీ ఎంపీటీసీ గొర్లె కన్నతల్లి, నాయకులు బీశెట్టి అరుణ, కె.మల్లేశ్వరరావు, పొట్నూరు అప్పలరాజు (సాయిరాం), ఇందుకూరి శ్రీను రాజు, చెక్కా కిరణ్ కుమార్, అనకాపల్లి చెల్లయ్య, కాపుగంటి శ్రీనివాసు, వాకాడ బాల ఈశ్వర్ భరత్ (బాలు), వార్డు మెంబెర్ యలమంచిలి అక్కునాయుడు, సరిపల్లి రామ కృష్ణ, రాయవరపు రవి శంకర్, బర్ల స్వామినాయుడు, కనిశెట్టి ఈశ్వర రావు, యలమంచిలి స్వామినాయుడు, ఆడారి సూరి అప్పారావు, కె.శంకరరావు, కాపు అప్పారావు, యువత పెదగాడ రాజు పాల్గొన్నారు.

గుర్ల: పెరిగిన విద్యుత్ ధరలకు నిరసనగా చీపురుపల్లి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి కిమిడి నాగార్జున ఆదేశానుసారం గుర్ల మండల టీడీపీ అధ్యక్షులు చనమల మహేశ్వరరావు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెన్నె సన్యాసినాయుడు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత విద్యుత్ చార్జీలు పెంచుకుంటూ పోతుందని అలాగే విద్యుత్ కోతలు ఎక్కువయ్యాయని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పిల్ల అప్పలనాయుడు, నియోజకవర్గ ఐటీడీపి అధ్యక్షులు నాగులపల్లి నారాయణరావు, నియోజకవర్గ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి మండల అప్పలనాయుడు, జిల్లా టీడీపీ నాయి బ్రాహ్మణ కమిటీ కార్యదర్శి బెల్లాన సత్యనారాయణ, జిల్లా తెలుగురైతు కార్యదర్శి కనిమెరక కృష్ణ, మండల యువత అధ్యక్షులు కె.పైడినాయుడు నాయకులు పాల్గొన్నారు.

జామి: రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపుపై పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపు మేరకు మండల కేంద్రమైన జామిలోని విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట మండల పార్టీ అధ్యక్షుడు లగుడు రవికుమార్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి బండారుపెదబాబు, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు రెడ్డి పైడిబాబు,విశాఖ పార్లమెంటరీ మహిళా కార్యదర్శి ఇప్పాక వెంకట త్రివేణి, స్థానిక నేతలు శిరికిపాలెం సన్యాసినాయుడు, వి.నాయుడు బాబు,కలగాడ రామకృష్ణ ,పెద్దా,తదితరులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. పెంచిన చార్జీలను తగ్గించాలని, వ్యవసాయ మోటార్లకు మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేసారు. ఆందోళనా కార్యక్రమాన్ని గొంప కృష్ణ వర్గం చేయగా, కోళ్ళ వర్గం నేతలు మాత్రం స్థానిక ఆందోళనలో పాల్గొనలేదు.

బలిజిపేట: రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు పెంచిన విద్యుత్ చార్జీలని తగ్గించాలని, విద్యుత్ సరఫరా సక్రమంగా చేయాలని కోరుతూ విద్యుత్ కార్యాలయం ముందు మంగళ వారం మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండలపార్టీ అధ్యక్షులు పెంకి వేణుగోపాలనాయుడు, టిడిపి సీనియర్ నాయకులు వాడాడ రాము ఆధ్వర్యంలో మండలంలోని చిలకలపల్లి సబ్ స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యుత్ చార్జీల బాదుడు తగ్గించాలని, విద్యుత్ కోతలు లేకుండా సరఫరా సక్రమంగా చేయాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి బాబ్జి, ఎస్.రాంబాబు, జి.సింహాచలం, ఎస్.సోములు, నారాయణరావు, సత్యనారాయణ, బి.తిరుపతిరావు, అధికార వేణు, రామారావు, నాగేంద్ర, రామారావు, శివ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

బొండపల్లి: పరిపాలన చేతకాని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గద్దె దిగాలని బొండపల్లి మాజీ జడ్పిటిసి బండారు బాలాజీ డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు విద్యుత్ బిల్లులు కరెంటు కోతలకు నిరసనగా బొండపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బొడ్డు ఉమామహేశ్వరరావు, కాసా రంగనాయకులు, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కురుపాం: పెదమేరంగి ,గుమ్మ లక్ష్మీ పురంలలో తెలుగుదేశంపార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో గల విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద విద్యుత్ మోటార్లకు మీటర్లు బిగించడం, ఎప్పటికప్పుడు అప్రకటిత కరెంట్ కోతలు విధించడం, ఇష్టారీతిన కరెంట్ చార్జీలను పెంచడం వంటి ప్రజాకంటక చర్యలకు పాల్పడుతున్న ఈ దుర్మార్గ ప్రభుత్వంపై నిరసన నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడమైనది. ఈ కార్యక్రమంలో గుమ్మలక్ష్మీపురం మండల తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కురుపాం మండల కన్వీనర్ కలిసెట్టి వెంకట కొండయ్య ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశంపార్టీ నాయకులు మీడియా కోఆర్డినేటర్ సుకేష్ చంద్ర పండా, తెలుగుయువత మండల అధ్యక్షులు ఆరిక సాయి, కలిసెట్టి శ్రీను,మండల ,సెల్ అర్తవు మహేష్, గోటివడ వాసు,మాలతి,అమిత్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ అసిస్టెంట్లతో సమీక్ష

విశాలాంధ్ర - తెర్లాం: ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లతో అవెన్యూ ప్లాంటేషన్, హార్టికల్చర్లో భాగంగా వేసిన మొక్కలు, వేతనదారుల ఆధార్ సీడింగ్, షెడ్యూల్ కులాల వారికి పనుల కల్పన, చెత్త నుండి సంపద కేంద్రములలో వున్న సేంద్రియ ఎరువు అమ్మకం తదితర అంశములపై మంగళవారం సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ మాట్లాడుతూ అవెన్యూ ప్లాంటేషన్లో భాగంగా ఏ పంచాయతీ పరిధిలో ఎన్ని మొక్కలను రోడ్లకి ఇరువైపులా నాటారు బిల్లులు తదితరాలపై సమీక్ష నిర్వహించారు. వేతనదారుల ఆధార్ సీడింగ్ త్వరగా పూర్తి చేసుకోవాలని ఆదేశించారు. షెడ్యూల్ కులాల వారికి పనుల కల్పన శత శాతం కల్పించాలని, చెత్త నుండి సంపద కేంద్రములలో వున్న సేంద్రియ ఎరువు అమ్మకం చేపట్టాలని ఆదేశించారు.

వైఎస్సార్ ఆసరా స్టిక్కర్లు అందజేత

విశాలాంధ్ర - తెర్లాం: మండలంలో మంగళవారం తెర్లాం గ్రామంలో వైఎస్సార్ ఆసరాకు సంబంధించి మంజూరు అయిన ప్రతీ సభ్యురాలికి లేఖ ద్వారా సీఎమ్ సందేశ పత్రములు స్టిక్కర్లు ఎంపీపీ ఎన్.ఉమా దేవి, ఎమ్ పీడీఓ రామకృష్ణ చేతుల మీద పంపిణీ చేయడం జరిగినది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా 3 వ విడత మొత్తం మండలం లో 1141 సంఘాలకు 5 కోట్ల 38 లక్షలు రూపాయలు సంఘం యొక్క పొదుపు ఖాతాలకు ప్రభుత్వం జమ చేయడం జరిగిందని, ఈ మొత్తం12556 మంది సభ్యుల యొక్క వ్యక్తిగత ఖాతాలకు బదిలీ చేయడం జరుగు తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రాము, వీఓఏ నాగమణి పాల్గొన్నారు.

20 మద్యం సీసాలతో ఒకరి అరెస్ట్

విశాలాంధ్ర - బొబ్బిలి: స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఇన్స్పెక్టర్ ఆర్.జైభీమ్ ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం బొబ్బిలి మండల పరిధిలో అలజంగి గ్రామానికి చెందిన వేటూరి తిరుపతి రావు మద్యం సీసాలు అమ్ముతుండగా 20 మద్యం సీసాలతో పట్టుకుని కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సీఐ మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా మద్యం సీసాలు, నాటుసారా విక్రయిస్తే 9440902372 కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ దాడుల్లో సిబ్బంది మాధవి దేవి, చంద్ర ప్రసాద్, ఆదినారాయణలు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీలు

విశాలాంధ్ర - తెర్లాం: తెర్లాం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 28 మంది పిల్లలు హాజరయ్యారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ముగింపు రోజు బహుమతి ప్రదానం ఉంటుందని గ్రంథాలయాధికారి సీహెచ్ కృష్ణమూర్తి తెలిపారు.

గుడివాడలో కుటుంబ వైద్యులు కార్యక్రమం

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని గుడివాడ గ్రామంలో వేపాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి ఏ.ధరణి ఆధ్వర్యంలో మంగళవారం కుటుంబ వైద్యుడు కార్యక్రమం నిర్వహించారు. మండల తహసీల్దార్ ఎస్.కృష్ణంరాజు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సాయి కూర్మనాద్ పట్నాయక్‌లు పర్యవేక్షించారు. అలాగే వైద్య సిబ్బంది గ్రామంలోని ప్రతి ఇంటికి తిరిగి 88మంది రోగులను గుర్తించి వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సి.హెచ్.ఓ జీఎస్సార్ ఆంజనేయులు,ఎం. ఎల్.హెచ్.పి. ఎస్.గమ్య, ఏఎన్‌ఎం బి.లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ డి.సత్యనారాయణ, అంగన్వాడీ కార్యకర్త సిరికి రమణమ్మ, మిగతా వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వార్డు సచివాలయ సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించాలి

విశాలాంధ్ర - బొబ్బిలి : వార్డు సచివాలయ సిబ్బంది విధులు సక్రమంగా నిర్వర్తించాలని విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు హెచ్చరించారు. మంగళవారం క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా ఇంచార్జ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీ, వార్డు ఎమినిటీ సెక్రటరీలతో రాణి మల్లమ్మ దేవి పార్కు కళాభారతి ఆడిటోరియం, సింహాల తోటలో ఉన్న గవర్నమెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ స్కూల్ ఏరియాలలో పర్యటించారు. మల్లమ్మ దేవి పార్కు వద్ద చేపలు అమ్ముకుంటున్న వ్యక్తులు ఆ చేపల యొక్క వ్యర్థాలను పార్కు సమీపంలో కళాభారతి ఆడిటోరియం వెనుక పడవేస్తున్నట్లుగా గుర్తించి వారికి జరిమానా విధించవలసిందిగా ఆదేశించారు. నాడు నేడు పనులు జరుగుతున్న గవర్నమెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలను సంబంధిత ప్రధానోపాధ్యాయులు వార్డ్ ఎమినిటీ సెక్రటరీలతో పరిశీలించి వంటశాల, ఫ్లోరింగు, ఇంకా మిగిలి ఉన్న పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

సొంత అన్ననే కత్తితో పొడిచి చంపిన తమ్ముడు

విశాలాంధ్ర - కురుపాం: మండలంలోని తూర్పు ముఠాలో గల జి.శివడ పంచాయతీ వేపమాను గూడలో అన్నదమ్ములు మధ్య చిన్న పాటి గొడవ జరిగి అన్నను కత్తి తో పొడిచి చంపిన స్థాయికి చేరింది. ప్రేమానురాగాలతో రామలక్ష్మణులులా ఆప్యాయంగా ఉండాల్సిన అన్నదమ్ములు ఇలా భౌతిక దాడులు చేసుకుని హత్యకు దారితీయటంతో వేపమాను గూడ శోకసంద్రంలో మునిగి పోయింది. ఈ నెల 20వ తేదీన తమ్ముడు పాలక మిన్నరావు వివాహం జరిగింది. ఆ పెళ్లి ఖర్చుల నిమిత్తం సారె విషయంలో తలెత్తిన గొడవలలో సొంత అన్న పాలక ఇండియా (30)ను తమ్ముడు పాలక మీన్నారావు (28) గొంతుపై కత్తితో పొడిచి మంగళవారం రాత్రి హత్య చేశాడు. ఎల్విన్పేట సిఐ సత్యనారాయణ ,నీలకంఠాపురం ఇన్చార్జి ఎస్ ఐ షణ్ముఖరావు ,సంఘటన స్థలానికి చేరుకుని సమగ్రమైన దర్యాప్తు చేస్తున్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం పార్వతి పురం జిల్లా ఆసుపత్రికి తరలించారు.

గ్రామాల్లో భూముల రీ సర్వే విషయం రైతులకు చెప్పరా..!

- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్సీ రఘురాజు

విశాలాంధ్ర - శృంగవరపుకోట : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే విషయాన్ని ఆయా గ్రామాల్లోని రైతులకు ఎందుకు ముందుగా తెలియజేయడం లేదని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తహశీల్దార్ డి.శ్రీనివాసరావుని మండల సర్వసభ్య సమావేశంలో ప్రశ్నించారు. ఎంపీపీ ఎస్.సోమేశ్వరరావు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ రీ సర్వే పేరు చెప్పి గ్రామ సచివాలయంలోని సిబ్బంది ప్రజలకు అందుబాటులో లేకుండా పోతున్నారని అన్నారు. ప్రజల కోసమే కదా ప్రభుత్వం గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ఇక రీసర్వేలో గుర్తించిన తప్పులను సరి చేసి రైతులకు న్యాయం చేయాలని సూచించారు. తలారి ఎంపీటీసీ, న్యాయవాది ఎం.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రీసర్వేకు ముందు రైతు ప్రస్తుతం అనుభవిస్తున్న భూమి ఎకరా ఉంటే, మీ రీసర్వే అనంతరం ఆ భూమి 80 సెంట్లు ఉంటే అలాంటి సమస్యలను ఎలా పరిష్కరిస్తారని తహశీల్దార్‌ను ప్రశ్నించారు. ఎంపీపీ ఎస్.సోమేశ్వరరావు, ఎంపీడీఓ శేషుబాబు మాట్లాడుతూ ఏదైనా శాఖ తరపున గ్రామాల్లో కార్యక్రమాలు ఏర్పాటు, అధికారులు పర్యటనలు చేస్తే ముందుగా ఎంపీడీఓ కార్యాలయానికి సమాచారం అందిస్తే ఆ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలకు తెలియపరుస్తామని, అప్పుడు ఎటువంటి సందేహాలకు తావుండదని స్పష్టం చేశారు. ఇక హౌసింగ్ ఏఈ మండలం వారీగా ఇళ్ల నిర్మాణాలు, బిల్లులు మంజూరు విషయం చెబుతుండగా.. గ్రామాల్లో పాత ఇళ్లకు బిల్లులు ఎందుకు మంజూరు చేయడం లేదని వైస్ ఎంపీపీ ఐ.సుధారాజు, పినిశెట్టి వెంకటరమణ, చామలాపల్లి సర్పంచ్ జుత్తాడ సూర్యారావు, ధర్మవరం సర్పంచ్ గాలి సన్యాసయ్య తదితరులు ప్రశ్నించారు. చామలాపల్లి సర్పంచ్ సూర్యారావు గత హౌసింగ్ సిబ్బంది చేసిన అవినీతి బాగోతంపై ఫోన్ సంభాషణలతో కూడిన ఆధారాలు బయటపెడతానని, ఒక వ్యక్తి ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుని, గృహ ప్రవేశం చేసుకుని దిగిపోయినా బిల్లును ఎందుకు మంజూరు చేయలేదో వెల్లడించాలని పట్టుబట్టారు. గత నాలుగైదు పర్యాయాలు సమావేశాల్లో చెప్పిన సమస్యలు పరిష్కరించనపుడు ఈ సమావేశాలు ఎందుకని చామలాపల్లి, కృష్ణాపురం సర్పంచులు సూర్యారావు, హేమ ఆవేదన వ్యక్తంచేశారు. ఇక సర్పంచులకు రాజ్యాంగ పరంగా ఉన్న హక్కులను కూడా అధికారులు కాలరాస్తున్నారని ధర్మవరం సర్పంచ్ సన్యాసయ్య ఆరోపించారు. ఎస్.కోట సీహెచ్సీ నుండి రిఫరల్ కేసులను విజయనగరం కాకుండా విశాఖలోని ఆసుపత్రులకు తీసుకెళ్ళేలా సమావేశంలో తీర్మానం చేయాలని వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, సభ్యులు ఎంపీడీఓను కోరారు. పోతనాపల్లి గ్రామ చెరువులో గత ప్రభుత్వంలోని మాజీ ఎమ్మెల్యే ఐదు ఇళ్లకు ఎలా పొజిషన్ సర్టిఫికేట్లు అందజేశారో చెప్పాలని తహశీల్దార్ ని గ్రామ సర్పంచ్ కూనిరెడ్డి వెంకటరావు ప్రశ్నించారు. ముషిడిపల్లి, తిమిడి గ్రామాల్లోని త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని వైస్ ఎంపీపీ సుధారాజు, సర్పంచ్ త్రినాధమ్మ కోరగా కొద్దిరోజుల్లో పరిష్కరిస్తామని ఆర్.డబ్ల్యు.ఎస్ ఏఈ సత్య కిషోర్ చెప్పారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, పలువురు అధికారులు మాట్లాడారు. భూమి సమస్యను గత నాలుగైదు సమావేశాల్లో చెప్పినా తహశీల్దార్, సిబ్బంది పరిష్కరించడం లేదని, అదే రూ.90వేలు పట్టుకుని వస్తే చిటికలో పనవుతుందని ఒక అనధికార వ్యక్తి చెబుతున్నాడని కృష్ణాపురం సర్పంచ్ హేమ సభ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే తహశీల్దార్ తన ఫోన్ ఎత్తడం లేదని, ఆఫీసుకి వెళ్తే గౌరవించడం లేదని సమావేశంలో ఆరోపించారు. సర్పంచ్ ఆరోపణలను తహశీల్దార్ శ్రీనివాసరావు ఖండించారు. సమావేశంలో పాల్గొన్న ఎంపీటీసీలు, సర్పంచులు ఎవరికైనా తాను గౌరవం ఇవ్వలేదంటే సభాముఖంగా చెప్పాలని కోరారు. ఇక తహశీల్దార్ కార్యాలయంలో డబ్బులకు పని చేయిస్తామని మీతో చెప్పిన అనధికార వ్యక్తి ఎవరో చెబితే చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ గట్టిగా అడిగారు. ఈ సమయంలో ఎంపీపీ సోమేశ్వరరావు కలుగజేసుకుని ఆధారాలు లేకుండా అధికారులపై ఆరోపణలు వద్దన్నారు. కాగా కిల్తంపాలెం సర్పంచ్ సుంకరి ఈశ్వరరావు గ్రామాల్లో కుక్కలు పెరిగిపోయాయని, వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ ను ఎంపీడీఓ శేషుబాబు మర్యాదపూర్వకంగా తిరస్కరించారు.

రైతులకు రవాణా, హమాలీ చార్జీలు చెల్లించాలి

విశాలాంధ్ర - బొబ్బిలి : ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం ఇచ్చిన రైతులకు రవాణా, హమాలీ చార్జీలు చెల్లించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం, సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. సిఐటియు కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించిన రైతులు సొంతంగా రవాణా, హమాలీ చార్జీలు భరించి ధాన్యం తరలిస్తే రైతులకు ప్రభుత్వం నేరుగా ఆయా చార్జీలను చెల్లిస్తుందని ప్రకటించినా చెల్లించకపోవడం అన్యాయమన్నారు. రైతుల బ్యాంక్ ఖాతాలకు జమ చేయకుండా ప్రైవేట్ ఏజెన్సీల బ్యాంకు ఖాతాలకు జమ చేసి మింగేసేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు. దీనిపై జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తే స్పందనలో రైతులు దరఖాస్తు చేస్తే రైతులకు చెల్లిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారన్నారు. రైతులు స్పందనలో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తులు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలం వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు. పూర్తి వివరాలకు 73960 30015ను సంప్రదించాలని కోరారు. రైతులకు న్యాయం చేయాలని ఈనెల 29న బొబ్బిలి ఆర్డిఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామన్నారు.

ఎమ్మార్ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: 2023 - 24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎమ్మార్ ప్రభుత్వ సంస్కృత కళాశాలలో ప్రవేశానికి సంబంధించి ఆసక్తి కలిగిన విద్యార్థిని, విద్యార్థుల దరఖాస్తులను ఆన్లైన్ ద్వారా స్వీకరించబడుతుందని కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ పి.గౌరీశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం కళాశాల ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ ఇంతకుముందు ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మార్ ప్రభుత్వ సంస్కృతి కళాశాలకు ప్రత్యేకించి నిధులు కేటాయించడం హర్షనీయమన్నారు. 2023 - 24 సంవత్సరానికి సంబంధించి కళాశాలలో బిఏ ఓఎల్ సాంస్క్రిట్, బి ఏ ఓ ఎల్ తెలుగు, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సులకు సంబంధించి దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా సర్టిఫికెట్ కోర్స్, స్కాలర్షిప్స్, కంప్యూటర్ ల్యాబ్స్, ఐటీ ఫ్యాక్టరీస్ ప్రత్యేకత కోర్సులతో పాటు ఫినిషింగ్ స్కూల్ కూడా రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మార్ సంస్కృతి కళాశాలలో నిర్వహించడం జరుగుతుందని ఆయన చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అనిల్ కుమార్ పర్యవేక్షణలో విద్యార్థినీ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే విధంగా కళాశాలలోని ప్రతి అధ్యాపకులు నిబద్ధతతో కృషి చేయడం జరుగుతుందని కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ గౌరీశ్వరరావు స్పష్టం చేశారు. ఆసక్తిగల విద్యార్థిని, విద్యార్థులు తమ దరఖాస్తులను www.mrgsc.ac.in | mrgovtsanskritcollegevzm@gmail.com | principal@mrgsc.ac.in గల వెబ్ సైట్ లో పంపవచ్చని ఆయన చెప్పారు. వివరాలకు 9441 413612, 94926 20482, 94926 17718, 8500 37 4832, 9491 841585 నెంబర్లను సంప్రదించాలన్నారు.

సిఫార్సుల మేరకే పురస్కారాలు: వాలంటీర్లు విమర్శ

విశాలాంధ్ర - భోగాపురం : గ్రామ, వార్డు వాలంటీర్ల సేవలకు సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాల ప్రధానోత్సవం భాగంగా భోగాపురం పంచాయతీ కార్యాలయంలో వలంటీర్ల వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 52 మంది వాలంటీర్లకు సేవ మిత్ర, ఒకరికి సేవరత్న పురష్కారం అందించారు. వాలంటీర్లకు సాలువాతో సత్కరించి సర్టిఫికెట్లు ప్రధానం చేశారు అలాగే సేవామిత్ర పురస్కారం పొందిన వాలెంటీర్లలుకు బహుమతిగా 10 వేలు, సేవ రత్నకు 20 వేలు రూపాయలు ప్రభుత్వం అందించనుంది. అయితే ఈ పురస్కారాల ఎంపికపై కొందరు వాలంటీర్లు విమర్శలు గుప్పిస్తున్నారు. కష్టపడ్డా గుర్తించడం లేదని, ఏ ప్రాతిపదికన పురస్కారాలు ఇస్తున్నారో తెలియడం లేదని, ఇప్పటివరకు భోగాపురం వాలంటీర్లకు ఒక్కరికి కూడా సేవ వజ్ర రాలేదని, ఇక్కడ కష్టపడ్డవారిని వెనుకకు పెడుతున్నారని, సిఫార్సులు ఆధారంగా పురస్కారాలు అందిస్తున్నారని ఆవేదన చెందారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో సర్పంచ్ అప్పయ్యమ్మ, ఇ ఓ రామకృష్ణనాయుడు, గ్రామ పెద్దలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

ముగిసిన ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి

విశాలాంధ్ర - వేపాడ/ లక్కవరపుకోట: రాష్ట్రంలో టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నిర్వహించిన ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమం ముగియడంతో మిగిలిన కరపత్రాలను విశాఖ పార్టీ కార్యాలయానికి తరలింపు కార్యక్రమం సోమవారం ఎల్ కోటలో వారి స్వగృహం నుండి తన వాహనంలో తీసుకెళ్లేందుకు సన్నద్ధమై జండా ఊపి ప్రారంభించారు. ఈ మేరకు శృంగ వరపుకోట నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి మాట్లాడుతూ అన్ని గ్రామాలలో "ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి" అనే కార్యక్రమం నిర్వహించేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామములలో ఉన్న ప్రజలు "ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి" కార్యక్రమం పారమ్స్‌లో ఉన్న 14 సమస్యల్లో ప్రధానంగా 10 సమస్యలను ఎక్కువగా నింపిన సమస్యలు తెలపడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి కోళ్ళ బాలాజీ అప్పల రాంప్రసాద్, ఎస్.కోట నియోజకవర్గ తెలుగుయువత ఉపాధ్యక్షులు, ఖాసాపేట గ్రామ సర్పంచ్ కోళ్ల భూపాల్ నాయుడు,జామి మండల పార్టీ మాజీ అధ్యక్షులు గనివాడ ఎర్నాయుడు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు అప్పల నాయుడు మాస్టర్, ఈశ్వరరావు, కృష్ణ, గోగాడ సత్యం మాస్టర్, నిరుజోగి అమ్మతల్లినాయుడు, కరెడ్ల శ్రీను, టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి, ప్రజలకు వారిధిగా వాలంటీర్లు

విశాలాంధ్ర - గుర్ల: ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో గ్రామ వార్డు వాలంటీర్లే ప్రధాన భూమిక పోషిస్తున్నారని ఎంపీపీ ప్రతినిధి పొట్నూరు సన్యాసినాయుడు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి సూర్యనారాయణ రాజు, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గుర్ల, కోటగండ్రెడు, కెల్ల, ఎస్ఎస్ఆర్ పేట సచివాలయం కార్యాలయంలో వాలంటీర్లు వందనం కార్యక్రమంలో సేవా మిత్ర పురస్కారాలు అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, బంగారునాయుడు, మణి, ఎంపీడీవో కళ్యాణి, నోడల్ ఆఫీసర్స్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

దత్తిరాజేరు: వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా కే కృష్ణాపురం, కే కొత్తవలస, పాచిలవలస సచివాలయంలో మంగళవారం ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు చేతుల మీదుగా సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్రలకు నగదుతో పాటు, శాలువలతో సత్కారం కూడా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీ బమిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, బీసీ సెల్ అధ్యక్షులు మంత్రి అప్పలనాయుడు, ఏఎంసి వైస్ చైర్మన్ మండల శ్రీనివాసరావు, పిఏసిఎస్ అధ్యక్షులు సుమల శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ మహదేవ్ ఫణీంద్ర, తహశీల్దార్ పి.రమేష్, సర్పంచులు, ఎంపీటీసీలు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని నిడగల్లు గ్రామ సచివాలయ పరిధిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం వాలంటీర్లకు వందన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అలజింగి జోగారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రభుత్వం వాలంటీర్లకు ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు. ప్రజలకు సేవచేసే భాగ్యం వాలంటీర్లకు దక్కడం, గత మూడేళ్లుగా వాలంటీర్లకు సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర పేరిట ప్రభుత్వం సత్కారం చేయడం ఎంతో గర్వకారణమన్నారు. నిడగల్లు, సూరమ్మపేట, గుచ్చిమి, వెంకటపురం, పెదంకలం, సుమిత్రపురం, కృష్ణరాయపురం, బూర్జ, లక్ష్మీపురం, చెల్లం నాయుడువలస, ఎగోటివలస పంచాయతీలకు చెందిన వాలంటీర్లను దుశ్శాలువా, ప్రశంసా పత్రంలను అందజేసి సత్కరించారు. పెదఅంకలం సచివాలయంలో పెదఅంకలం, సుమిత్ర పురం గ్రామపంచాయతీలకు చెందిన వంగపండు వేణుగోపాలరావు, వావిలపల్లి అనసూయలనే ఇద్దరు వాలంటీర్లకు సేవావజ్ర ఇప్పటికే జిల్లా కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అందజేయగా, బర్ల గంగ, చొంగలి పకీరు నాయుడు, గురాన పావని, తెంటు కృష్ణవేణి, గంట పద్మారాణిలకు సేవారత్న క్రింద సోమవారం ఎమ్మెల్యే జోగారావు సత్కరించారు. మిగిలిన వారందరికీ సేవామిత్ర సత్కారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బొంగు చిట్టిరాజు, ఎంపిడిఓ ప్రసాద్, జడ్పీటీసీ బాబ్జి, వైస్ ఎంపిపి సూర్యనారాయణ, నిడగల్లు గ్రామానికి చెందిన నాయకులు అరుద్రమ్మ, గాజాపు శ్రీనివాసరావు, పరువాడ తిరుపతిరావు, పాత్రుడు, నిడగల్లు పంచాయతీ కార్యదర్శి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు. ఈనెల 25న, 29న మిగిలిన సచివాలయాల పరిధిలోని వాలంటీర్లకు సత్కారం ఉంటుందని ఎంపిడిఓ ప్రసాద్ తెలిపారు.

నెల్లిమర్ల: సచివాలయ వ్యవస్థలో వలంటీర్లు కీలక భూమిక పోషిస్తున్నారని వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ అన్నారు. నెల్లిమర్ల మండలం కొండగుంపాం సచివాలయంలో మంగళవారం సర్పంచులు పతివాడ అప్పన్న, గుంటమాని ఉమా మహేశ్వరరావు ఆధ్వర్యంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పతివాడ నాగరాజుకి సేవారత్నం అవార్డు కింద రూ.20వేలు నగదు బహుమతి అందజేసి దుశ్శాలువతో సత్కరించారు. మిగతా వలంటీర్లకు సేవా మిత్ర అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు కిరణ్ కుమార్, శ్రీదేవి, వార్డు సభ్యులు మొయిద రాంబాబు, పతివాడ రాజారావు, నాయకులు రెడ్డి సన్యాసినాయుడు, నడిపేన సీతం నాయుడు, పతివాడ గోపి, నడిపేన రాము, పతివాడ సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వాలంటీర్లకు వందనం

విశాలాంధ్ర - తెర్లాం: మండలంలో విజయరాంపురం సచివాలయ పరిధిలో బుధవారం జరగనున్న వాలంటీర్లకు వందనం కార్యక్రమం యొక్క సభావేదిక స్థలాన్ని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ పరిశీలించారు. ఈ మేరకు సచివాలయం సిబ్బంది, వాలంటీర్లకు అనుసరించిన విధివిధానాలపై సూచనలను జారీ చేశారు.

వాలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని ఖాళీలు ఏర్పడ్డ గ్రామాల నుండి వాలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి సాయి కూర్మనాద్ పట్నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రామస్వామి పేట గ్రామంలో బి.సి డి జనరల్ ఒక పోస్టు, నల్లబిల్లి గ్రామంలో బి.సి డి పురుషుడు ఒక పోస్టు, పాటూరు గ్రామంలో బి.సి డి మహిళ ఒక పోస్టు ఖాళీలు ఏర్పడ్డాయన్నారు. ఆయా గ్రామాల్లో అర్హత కలిగిన అభ్యర్థులు 24వ తేదీ లోపు ఆన్లైన్ చేసుకోవాలన్నారు. అదేవిధంగా 25న దరఖాస్తు పరిశీలన, 26న ఎంపిక కమిటీ ద్వారా మౌఖిక పరీక్ష ఉంటుందన్నారు. ఈ పోస్టులకు 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అర్హులని, దరఖాస్తుదారులకు 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలన్నారు. మరింత సమాచారం కొరకు కార్యాలయ సిబ్బందిని సంప్రదించాలని ఎంపీడీవో పట్నాయక్ తెలిపారు.

జీవో నెంబర్ 47ను సవరించాలి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: జీవో నెంబర్ 47ను సవరించాలని ఏపీటీఎఫ్(1938) జిల్లా అధ్యక్షులు డి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జీవో నెంబర్ 47ను సవరించాలని, బదిలీలలో ఏ ఒక్క పోస్టు బ్లాక్ చేయకుండా ఖాళీలన్నీ చూపాలన్నారు. ఉపాధ్యాయులపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులకు 50 శాతం అనే విధానం కాకుండా అందర్నీ రిలీవ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ కృష్ణ ,ఎన్ వి పైడ్రాజు, ఏవి శ్రీనివాసరావు, వై మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు

మహిళల ఆర్థిక బలోపేతం కోసమే ఆసరా

విశాలాంధ్ర - వేపాడ : మహిళల ఆర్థిక బలోపేతం కోసమే సీఎం జగన్మోహన్ రెడ్డి ఆసరా నిధులను మంజూరు చేశారని ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు (సతీష్) అన్నారు. వైస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో 3వ విడత వైస్సార్ ఆసరా విత్ డ్రా కోసం డిజిటల్ ఎక్ నా లెడ్జమెంట్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 1059 డ్వాక్రా సంఘాలుండగా 11వేల 978మంది సభ్యులకు 6కోట్ల 82లక్షల రూపాయలను సభ్యుల ఖాతాల్లో ప్రభుత్వం మూడవ విడత నిధులను జమచేసిందన్నారు. జడ్పీటీసీ ఎస్ అప్పారావు మాట్లాడుతూ మూడు విడతలలో ప్రభుత్వం 19కోట్ల 82లక్షల రూపాయలను ప్రభుత్వం సంఘాల ఖాతాలలో జమ చేయడం హార్షనీయమన్నారు. డి ఆర్ డి ఏ వైస్సార్ క్రాంతిపథం ఏపీఎం ఆర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ఎస్ అప్పారావు, పంచాయతీరాజ్ వింగ్ చైర్మన్ మెరవల సత్యనారాయణ, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు నిరుజోగి వెంకటరావు, ఎంపీటీసీ గాడి గంగతల్లి, సీసి కృష్ణ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పుస్తక పఠనముతో విజ్ఞానం

విశాలాంధ్ర - రేగిడి: పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని శ్రీకాకుళం జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వి.శంకర్రావు అన్నారు. మంగళవారం రేగిడి ఆమదాలవలస మండలం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం ఆయన పరిశీలించారు. శాఖ గ్రంథాలలో 35 మంది విద్యార్థులు నిరుద్యోగులు పుస్తక పఠనం చేస్తుండడంతో, శాఖా గ్రంథాలయ అధికారి బివి రమణమూర్తి చూస్తున్న కృషిని అభినందిస్తూ సంతృప్తిని వ్యక్తం చేశారు. గ్రంథాలయాలు ద్వారా నిరుద్యోగ యువత, విద్యార్థులు విజ్ఞానాన్ని సముపార్జించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

మహానాడును విజయవంతం చేయాలి

విశాలాంధ్ర - వేపాడ: రాజ మహేంద్రవరంలో ఈనెల 27, 28 తేదీలలో జరగనున్న మహానాడు సభలకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని మండల టీడీపీ నేతలు కొట్యాడ రమణమూర్తి, పోతల వెంకటరమణ తదితరులు పిలుపునిచ్చారు. మండల కేంద్రం వేపాడలోని ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి కోళ్ల లలితకుమారి, తెలుగుదేశం పార్టీరాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల రాంప్రసాద్‌ల సారథ్యంలో మండలంలో గల టీడీపీ శ్రేణులంతా అధిక సంఖ్యలో తరలివచ్చి మహానాడు సభలను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు గోకేడ అచ్చం నాయుడు (మద్దాలు)నిరుజోగి బంగారునాయుడు, ఏడువాక రామకృష్ణ, కోన సత్యం, నిరుజోగి అమ్మతల్లి నాయుడు, గోకేడ సత్యం,గోకేడ నాగభూషణం, నాగిరెడ్డి ముత్యాలనాయుడు, గొర్రుపోటు ప్రసాద్, బూసరి కృష్ణకుమార్ తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కేతు విశ్వనాథ రెడ్డి మృతి తెలుగు సాహితీ రంగానికి లోటు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఆచార్య కేతువిశ్వనాథ రెడ్డి మృతి తెలుగు సాహితీ రంగానికి తీరని లోటు అని ప్రముఖ రచయిత, తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్ పేర్కొన్నారు. అక్షర సంపన్నుడు, నిరాడంబరుడైన కేతు విశ్వనాథ రెడ్డి తెలుగు జాతి గర్వించదగ్గ రచయిత అని, అభ్యుదయ రచనలకు చిరునామాగా నిలిచిన మహనీయుడి ఆత్మకు శాంతి చేకూరాలని పేర్కొన్నారు. 2012 జూలై 1వ తేదీన విజయనగరం ఉపాధ్యాయ భవనంలో హైదరాబాద్‌కు చెందిన కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ప్రధాన కార్యదర్శి మద్దాళి రఘురామ్ ఆధ్వర్యంలో కొవ్వలి లక్ష్మీనరసింహారావు శతజయంతి ఉత్సవాలలో విశ్వనాథ రెడ్డి పాల్గొన్నారని, ఈ నేపథ్యంలో 'వెయ్యినవలల కొవ్వలి' అనే పేరుతో తాను రాసిన పుస్తకాన్ని కేతు విశ్వనాథరెడ్డి ఆవిష్కరించారని, అది ఒక మధురమైన జ్ఞాపకమని గురుప్రసాద్ పేర్కొన్నారు. ఆ నాటి కార్యక్రమంలో మధురవచస్వి మానాప్రగడ శేషశాయి, ద్వానా శాస్త్రి, కొవ్వలి లక్ష్మీనారాయణ కూడా పాల్గొన్నారని తెలిపారు.

జగనన్న శాశ్వత భూహక్కుతో రైతులకు మేలు

విశాలాంధ్ర - నెల్లిమర్ల: వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు పథకంతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందని పురపాలక శాఖ ప్రాంతీయ సంచాలకులు జి.నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం ఆయన నెల్లిమర్ల నగర పంచాయతీని సందర్శించి మాట్లాడారు. అభివృద్ధి పనులు, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, సచివాలయాల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. అనంతరం నెల్లిమర్ల నగరపంచాయతీలో డ్రోన్ ద్వారా చేపడుతున్న భూ రీ సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో కమిషనర్ పి బాలాజీ ప్రసాద్, వార్డు ప్లానింగ్ కార్యదర్శులు, నగరపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ తనిఖీ చేసిన డీఎస్వో

విశాలాంధ్ర - కురుపాం: స్థానిక సాయి బాలాజీ పెట్రోల్ బంక్‌లో పార్వతి పురం మన్యం జిల్లా డిఎస్వో కెవిఎల్ఎన్ మూర్తి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఇటీవల అందిన ఫిర్యాదు పైస్పందించిన ఆయన ఆయిల్ నాణ్యత ,కొలతలను పరిశీలించారు. ఆ సమయంలో ఐదు లీటర్ల ఆయిల్ కోసం ఫీడ్ చేయగా అదనంగా ఆయిల్ రావడం విస్మయం వ్యక్తం చేశారు. ఈ తనిఖీలో సిఎస్డిటి సాంబమూర్తి, బంక్ మేనేజర్ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

చారిత్రక విజయానికి నాలుగేళ్లు: పీడిక రాజన్నదొర

విశాలాంధ్ర - మెంటాడ: మండలంలోని పిట్టాడ గ్రామంలో మంగళవారం సర్పంచ్ కాపరపు నాయుడు బాబు ఆధ్వర్యంలో గడపగడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అందకపోతే కారణాలను గుర్తించి వారికి పథకాలు అందకపోతే కారణాలను అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే వారికి అందజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన పిలుపునిచ్చారు. దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చారిత్రక విజయానికి నాలుగేళ్ల పూర్తయింది ఆయన అన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైకాపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, సర్పంచ్ కాపారపు నాయుడు బాబు, రాష్ట్ర కొప్పల వెలమ డైరెక్టర్ రెడ్డి గౌరీ, రెడ్డి రాజు అప్పలనాయుడు,కనిమెరక త్రినాథ్ వైస్ ఎంపీపీలు సారిక ఈశ్వరరావు, పి. దుర్గ, వైఎస్సార్ పార్టీ నాయకులు చొక్కాకు సన్యాసి నాయుడు, దాట్ల హనుమంత రాజు, చప్ప సన్యాసులు, కలిశెట్టిసూర్యానారాయణ, రేగిడి రాం బాబు అధికారులు, వాలంటీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐదు రహదారులకు అటవీ అనుమతులు మంజూరు

విశాలాంధ్ర - పార్వతీపురం: జిల్లా స్థాయి అటవీ హక్కుల కమిటీ ఐదు రహదారుల నిర్మాణానికి అటవీ ప్రాంతంలో అవస రమగు స్థలానికి అటవీ అనుమతులు మంజూరు చేసిందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. అతని అధ్యక్షతన జిల్లా స్థాయి అటవీ హక్కుల కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జరిగింది. సీతంపేట, కురు పాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో నిర్మిస్తున్న రహదా రులకు అవసరమైన అటవీస్థలానికి అనుమతులు మంజూరు చేయాలని నిర్ణయించింది. సీతంపేట మండలంలో పూతికవలస రహదారి నుండి ద్వారబంధంవరకు ఐదు కిలమీటర్ల మేర రహదారిని రూ.3.02 కోట్లతోను, కురుపాంమండలం ఆవిరి ఆర్ అండ్ బి రోడ్డునుండి మత్రిపాడు ఆర్ అండ్ బి రోడ్ వరకు మండల సరిహద్దు వరకు 6.80 కిలో మీటర్ల రహదారిని రూ.4.67 కోట్లతో, అవిరి ఆర్ అండ్ బి రోడ్ జంక్షన్ నుండి దిమ్మిడిజోల వరకు (మండల సరిహద్దు వరకు) ఆరు కిలో మీటర్ల రహ దారిని రూ.4.66 కోట్లతో, అంటిజోల నుండి మనిగ వరకు (మండల సరిహద్దు వరకు) 2.30 కిలో మీటర్ల రహదారిని రూ.1.58 కోట్లతోను, గుమ్మలక్ష్మీపురం మండలం దేరువాడ నుండి వనకాబడి వరకు 2.80 కిలో మీటర్ల రహదారిని రూ.2.63 కోట్లతో నిర్మించుటకు ప్రతిపాదించారు. ఈ సమా వేశంలో జాయింట్ కలెక్టర్ మరియు పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి. విష్ణు చరణ్, సీతంపేట ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కల్పనా కుమారి, జిల్లా అటవీ అధికారి జి. ఏ.పి. ప్రసూన, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డా.ఎం. వి.ఆర్. కృష్ణా జి, కార్యనిర్వాహణ ఇంజినీరింగ్ ఎస్.రాధా రాణి, ఇతర కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

బూర్జలో మూడో రోజు కొనసాగిన గడప-గడపకు

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని బూర్జ గ్రామ సచివాలయంలోని బూర్జ గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు సారథ్యంలో మంగళవారం నాడు గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం మూడోరోజు నిర్వహించారు. 225వ రోజున 67వ సచివాలయంలో జరిగిన కార్యక్రమానికి గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే జోగారావుకు గ్రామపంచాయతీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు, వైఎస్సార్సీపీ కన్వీనర్లు స్థానిక ప్రజలు ఘనస్వాగతం పలికారు. ముందుగా గ్రామంలో ఇంటింటికి కుళాయి పనులకు ఎమ్మెల్యే జోగారావు శంకుస్థాపన చేశారు. మొదటి విడతగా 27లక్షల రూపాయలు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, సర్పంచ్ గుత్తావిల్లి దాసు, జడ్పీటీసీ మామిడి బాబ్జీ, మండల పార్టీ అధ్యక్షులు బొంగు చిట్టిరాజు, ఎంపీటీసీ చిన్నంనాయుడు సర్పంచ్లు జి.అన్నం నాయుడు, బి.శ్రీనివాస రావు, కె. శ్రీనివాసరావు, టి.వెంకటరమణ, శ్రీనివాసరావు, వైకాపా సీనియర్ నాయకులు అర్బీ పార్థసారథి,, పోల ఈశ్వర నారాయణ, బి ముకుంద, గౌరునాయుడు, రెడ్డి అప్పల నాయుడు, సత్యన్నారాయణ, డి నాగరత్నం ఎన్ రామకృష్ణ,, రమేష్, చప్ప సురేష్, తెర్లి సూరపు నాయుడు, మూడడ్ల అప్పలనాయుడు, అల్లు శ్రీనివాసరావు, రెడ్డి అచ్యుత, నీరస చంద్ర శేఖర్,గొడబ్రమీల, ఈదుబిల్లి అనిత పాల్గొన్నారు.

ఎస్.కోట ఇన్‌చార్జి గ్రూపు రాజకీయాలు చేస్తున్నారనడం హాస్యాస్పదం

విశాలాంధ్ర - వేపాడ: శృంగవరపుకోట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి కోళ్ళ లలిత కుమారి గ్రూపు రాజకీయాలను చేస్తున్నారని అనడం హాస్యాస్పదంగా ఉందని మండల టీడీపీ నేతలు కొట్యాడ రమణ మూర్తి, పోతల వెంకటరమణ టిడిపి నాయకులు అన్నారు. మండల కేంద్రం వేపాడలోని ప్రెస్ క్లబ్ లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి కోళ్ల లలితకుమారి టిడిపి నాయకులను కార్యకర్తలను ఏ ఒక్కరిని అగౌరపరిచే విధంగా నడవలేదని అలాగైతే మండల పార్టీ పగ్గాలు వారికి అప్ప చెప్పేవారు కాదని గ్రూపు రాజకీయాలకు ఏనాడు తావు లేకుండా నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని కార్యకర్తలు అందరిని కలుపుకొని విజయవంతం చేశారని, వారి స్వార్థం కోసం నియోజకవర్గంలో కొన్ని మండలాల్లో గ్రూపు రాజకీయాలకు అజ్యం పోసిన వ్యక్తులు గ్రూప్ రాజకీయాలు చేస్తున్నారని అనడం దెయ్యాలు వేదాలు వర్ణించినట్లు ఉందని ఎద్దేవ చేశారు. పార్టీ పదవులు పొందిన నాయకులు గ్రూపులను ప్రోత్సహించడం వల్ల పార్టీ బలహీన పడే అవకాశం ఉన్నందున చంద్రబాబు సూచనల మేరకు పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు.ఈ సమావేశంలో టీడీపీ నాయకులు గోకేడ అచ్చం నాయుడు (మద్దాలు)నిరుజోగి బంగారునాయుడు, ఏడువాక రామకృష్ణ, కోన సత్యం, నిరుజోగి అమ్మతల్లి నాయుడు,గోకేడ సత్యం,గోకేడ నాగ భూషణం, నాగిరెడ్డి ముత్యాలనాయుడు, గొర్రుపోటు ప్రసాద్, బూసరి కృష్ణ కుమార్ తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీని ప్రజలు సమాధి చేయడం తథ్యం: ఎమ్మెల్సీ

విశాలాంధ్ర - శృంగవరపుకోట : పేద మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాలపై ఇటీవల టీడీపీ నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సభలో నారా చంద్రబాబు నాయుడు అహంకారపూరితంగా శ్మశానంలోని సమాధులతో పోల్చే వ్యాఖ్యలకు మహిళలు, ప్రజలు రానున్న 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని సమాధి చేయడం తథ్యమని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు హెచ్చరించారు. చంద్రబాబు వ్యాఖ్యలను నిరసిస్తూ ఎస్.కోట మండల కేంద్రం శ్రీనివాసా థియేటర్ నుండి దేవిగుడి జంక్షన్ వరకు వైఎస్సార్సీపీ శ్రేణులు మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబు దిష్టిబొమ్మను దగ్ధం చేసారు. అనంతరం ఎస్.కోటలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సభ నిర్వహించిన ప్రదేశాన్ని పసుపునీటితో శుద్ధి చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఇచ్చే ఇళ్ళ స్థలాలను మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్మశానవాటికతో పోల్చడం దురంహంకారమునకు పరాకాష్ట అని, పేదప్రజలకు క్షమాపణ చెప్పి వెంటనే ఆ వ్యాఖ్యలను వెనక్కితీసుకోవాలని డిమాండ్ చేసారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రిపై, వారి పాలనపై అక్కసు వెళ్ళగక్కడం చంద్రబాబు మానసిక స్థితికి అద్దం పడుతుందని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ను తప్పుడు మాటలు మాట్లాడితే ప్రజలు సహించరని స్పష్టం చేశారు. రాష్ట్ర బి.సి కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉండగా చేసిన అవినీతి, అక్రమాలు ఒక్కొక్కటిగా ఇప్పుడు బయటపడుతుంటే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సహించలేక, భయంతో ఇష్టానుసారంగా సీఎం జగన్మోహన్ రెడ్డిని, ప్రభుత్వాన్ని నిరంతరం విమర్శిస్తున్నారని తెలిపారు. రానున్న 2024 ఎన్నికల్లో కూడా తెలుగుదేశం పార్టీకి, పెద్ద సైకో చంద్రబాబుకి, చిన్న సైకో లోకేష్ కి ప్రజలు బుద్ధి చెబుతారని జోస్యం చెప్పారు. ఈ నిరసన కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ రాష్ట్ర డైరెక్టర్ వాకాడ రాంబాబు, ఎస్.కోట ఎం.పి.పి సండి సోమేశ్వరరావు, జెడ్పీటిసి ఎమ్.వెంకటలక్ష్మి, వైస్ ఎం.పి.పిలు ఇందుకూరి సుధారాజు, పి.వెంకటరమణ, ఎస్.కోట మేజర్ పంచాయితీ సర్పంచ్ జి.సంతోషికుమారి, మండల పార్టీ అధ్యక్షులు మోపాడ కుమార్, జె.సి.ఎస్ మండల కన్వీనర్ కె.వెంకటరావు, ఎస్.కోట మండలంలోని పలువురు సర్పంచులు, ఎం.పి.టి.సిలు, వార్డు మెంబర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమ నిల్వ, అమ్మకాలు రెండూ నేరమే..

డిప్యూటీ తహశీల్దార్ ఎన్వీఎస్ఎన్ మూర్తి

విశాలాంధ్ర - శృంగవరపుకోట: జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఎస్.కోట తహశీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ మూర్తి మంగళవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఫోర్టిఫైడ్ బియ్యం ఉపయోగాలు, ప్రభుత్వ బియ్యం అక్రమ నిల్వలు, అమ్మకాలు, కొనుగోలు రెండూ నేరమేనని, నేరం రుజువైతే రేషన్ కార్డ్ రద్దు చేయబడుతుందని సీఎస్డీటీ హెచ్చరించారు. ఇదే విషయమై గ్రామాల్లోని ప్రజలకు ఈనెల 30వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వచ్చే జూన్ నెల నుండి కేజీ గోధుమ పిండిని రూ.16ల చొప్పున మూడు కిలోలు, కేజీ గోధుమలు రూ.10ల చొప్పున మూడు కేజీలు, కిలో కంది పప్పు రూ.67లు, అరకిలో పంచదార రూ.17లు, ఏఏవై కార్డుదారులకు రూ.13.50, అలాగే బియ్యం ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి స్పందన మేరకు చిన్నారికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - విజయనగరం : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్పందన మేరకు రేగిడి ఆముదాలవలస మండలం కందిశ గ్రామానికి చెందిన చిన్నారి పొనగంటి హేమలత చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి విడుదలైన ఆర్థిక సాయాన్ని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ చేతుల మీదుగా అందజేశారు. ఇటీవల భోగాపురం విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రిని చిన్నారి హేమలత తల్లిదండ్రులు కన్నబాబు, లక్ష్మీ లావణ్య కలిసి సమస్యను విన్నవించుకున్నారు. చిన్నారికి కంటి క్యాన్సర్ ఉందని సాయం అందజేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి సంబంధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం జేసీ మయూర్ అశోక్ తన ఛాంబర్లో చిన్నారి తల్లిదండ్రులకు రూ.1 లక్ష విలువ గల చెక్కును అందజేశారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం. గణపతిరావు, రేగిడి తహశీల్దారు కళ్యాణ చక్రవర్తి, సామాజిక కార్యకర్త పి. సిద్దార్థ, తదితరులు పాల్గొన్నారు.

బాలికల పాఠశాల, కళాశాలల్లో మహిళా సిబ్బందినే నియమించాలి

విశాలాంధ్ర - బెలగాం : గిరిజన సంక్షేమ శాఖలో జరిగే బదిలీల్లో గిరిజన బాలికల పాఠశాలలకు కళాశాలలకు మహిళా ఉపాధ్యాయులు, అధ్యాపకులనే నియమించాలని గిరిజన సంక్షేమ సంఘం నాయకులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్ కుమార్ లు కోరారు. ఈమేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖలో జరిగే బదిలీల్లో ఎట్టి పరిస్థితుల్లో బాలికల పాఠశాల, కళాశాలలో పురుషులను నియమించవద్దని కోరారు. బోధనేతర సిబ్బంది కూడా పురుషులు ఉండరాదన్నారు. సి.ఆర్.టి, ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయ, అధ్యాపకుల రెన్యువల్ ల్లో కూడా బాలికల పాఠశాలల్లో, కళాశాలల్లో మహిళా ఉపాధ్యాయులు, అధ్యాపకులనే నియమించాలన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ: ఒకరికి గాయాలు

విశాలాంధ్ర - బెలగాం : ఆటోను లారీ ఢీకొనడంతో ఆటో డ్రైవర్ కు తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సీతానగరం మండలం చినభోగిల గ్రామానికి చెందిన బోనెల ఆనంద్‌కు ఆటో ఉంది. దానిని బొబ్బిలి పార్వతీపురం మధ్యలో సర్వీస్ చేసుకొని జీవిస్తుంటాడు. అదే క్రమంలో తన ఇంటి నుండి మంగళవారం పార్వతీపురం వచ్చి మధ్యాహ్నం భోజనంకి తిరిగి ఇంటికి ఆటోను తీసుకుని వెళుండగా మరిపివలస గ్రామం ముందు పెద్దమామిడి చెట్టు దాటిన తరువాత ఎదురుగా బొబ్బిలి వైపు నుండి పార్వతీపురం వస్తున్న లారీ ఢీ కొట్టి ఆగకుండా వెళ్ళిపోయింది. ఈసంఘటనలో ఆటో బోల్తా పడింది. ఆటోను నడుపుతున్న ఆనంద్ కు తీవ్ర గాయలై లేవలేని స్థితిలో పడి ఉండగా గమనించిన ఆటో డ్రైవర్లు పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తీసుకొని రాగా వైద్యులు చికిత్స అందించారు. ఔట్ పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.

కొండచాకరాపల్లిలో వాలంటీర్లకు వందనం

విశాలాంధ్ర - వంగర: కొండచాకరాపల్లి గ్రామంలో వాలంటీర్లను ఎంపీపీ సురేష్ ముఖర్జీ సన్మానించారు. గ్రామాల్లో పలు సేవలందించిన గ్రామ వాలంటీర్లను మంగళవారం ఆయన సత్కరించారు. అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులైన లబ్దిదారులకు, వారి ఇళ్ల వద్దనే అందించేందుకు గాను, గ్రామ వాలంటీర్లు, సచివాలయ వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఎలాంటి వివక్షలు లేకుండా, అవినీతికి అవకాశం లేకుండా, నేరుగా అర్హులైన లబ్దిదారులకు ప్రభుత్వ పథకాలు చేరువ చేస్తున్న గ్రామ వాలంటీర్ల సేవలు వెలకట్టలేనివని అన్నారు. గ్రామ సచివాలయం పరిధిలో 14 మంది వాలంటీర్లను సన్మానించి, పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో వి.శ్రీనివాసరావు, పంచాయతీ ఆఫీసర్ త్రినాధరావు, కొప్పర, ఎంపీటీసి తాతబాబు, మాజీ సర్పంచ్ ప్రతినిధి రామకృష్ణ, చిట్టిబాబు, వాలంటీర్లు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి

విశాలాంధ్ర - వంగర: పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ కోతల్లేని విద్యుత్‌ను ఇవ్వాలని టీడీపీ నాయకులు భగ్గుమన్నారు. మంగళవారం మాజీ ఏ ఎం సీ చైర్మెన్ టీడీపీ సీనియర్ నాయకులు పైల వెంకట రమణ, రాజాం నియోజక వర్గ తెలుగు దేశం పార్టీ ఉపాధ్యక్షురాలు గంట పద్మ, తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బెజ్జిపురపు త్రినాదులు, దేశం నాయకులు లెంక సింహాలు, లక్ష్మింపేట అప్పలనాయుడు, బల్గిరెడ్డి తిరుపతిరావులు ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. విద్యుత్ చార్జీలను పెంచుకొనిపోతూ ప్రజలపై తీవ్ర మైన భారాన్ని మోపి ఇబ్బందులకు గురిచేస్తున్నారాన్నారు.

అర్బన్‌లో భూములు సర్వే

విశాలాంధ్ర-పాలకొండ: నగర పంచాయితీ కార్యాలయానికి రీజనల్ డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, విశాఖపట్నం జి.నాగరాజు విచ్చేసి సిబ్బందితో సమావేశమై పనితీరును, ఇంజనీరింగ్ వర్కుల స్టేటస్ విషయాలపై సిబ్బందితో సమీక్షించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నజగనన్న శాశ్వత భూహక్కు కార్యక్రమంలో అర్బన్ సర్వేలో పట్టణంలోని భూములు, గృహాలు, స్థలాలు, ప్రభుత్వ స్థలాలను గుర్తించే క్రమంలో కొండ వీధి చివరలో జరుగుతున్న డ్రోన్ కంట్రోల్ పాయింట్ ను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో కమీషనర్ శ్రీ ఎస్. సర్వేశ్వరరావు, ఇన్ చార్జ్ మేనేజర్ అండ్ అకౌంటెంట్ డి.బాపినాయుడు, టి.పి.బి.ఓ మూర్తి హెల్త్ అసిస్టెంట్ కళ్యాణి శేఖర్, వార్డు ప్లానింగ్ సెక్రటరీలు ఆర్ సాయినాథ్, ఎన్.నాయుడు, యం శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టండి

విశాలాంధ్ర-పాలకొండ: మండలం లుంబూరు నుండి కోటిపల్లి మధ్య సుమారుగా 4 కిలోమీటర్లు మేర కొత్త రోడ్ వేయడం ఈ రెండు గ్రామ పంచాయితీ ప్రజల మరియు రైతుల యొక్క ఎన్నో ఏళ్ళ చిరకాల ఆకాంక్ష. ఈ రోడ్ వలన మండల కేంద్రమైన పాలకొండ నుండి పెదకోటిపల్లి, చిన్న కోటిపల్లి, గుడివాడ, లుంబూరు గ్రామాల మధ్య ప్రజా రవాణా, వ్యవసాయ ఉత్పత్తుల రవాణా చాలా సులభతరం అవుతుంది. అలాగే ఆ గ్రామాలతో పాటుగా మల్లివీడు, చంద్రయ్య వలస, ఎరకం పేట, గ్రామాలకు పాలకొండకు మధ్య దూరం సుమారుగా 6 -7 కి.మీ తగ్గుతుంది. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని మంగళవారం శాసన మండలి సభ్యులు పాలవలస విక్రాంత్, ఐటీడీఏ పీవో కల్పనా కుమారి ని కలిసి ప్రత్యేక నిధులు కేటాయించాలని వినతి పత్రం అందజేయడం జరిగింది. ఆయన వెంట లుంబూరు గ్రామ సర్పంచ్ తిర్లంగి ఉపేంద్ర కుమార్ మరియు కోటిపల్లి సర్పంచ్ ప్రతినిధి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

అభ్యర్థి విషయంలో తప్పుడు ప్రచారం మానుకోండి

మాజీ ఎమ్మెల్యే కోళ్ళ వర్గంపై నిప్పులు చెరిగిన మండల నేతలు

విశాలాంధ్ర-జామి: ఎస్‌కోట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా అధినేత ఎవరి పేరును ప్రకటించలేదని, కానీ తననే ప్రకటించారని మాజీ ఎమ్మెల్యే కోళ్ళ లలితకుమారి వర్గీయులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండల పార్టీ అధ్యక్షుడు లగుడు రవికుమార్, మాజీ జెడ్‌పిటిసి బండారు పెదబాబు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు రెడ్డి పైడిబాబు, మాజీ సర్పంచ్ ఇప్పాక వెంకట త్రివేణి తదితరులు అభ్యంతరం వ్యక్తం చేసారు. మంగళవారం పెదబాబు స్వగృహంలో జరిగిన విలేఖరుల సమావేశంలో వీరు మాట్లాడుతూ సోషల్ మీడియాలో గుప్పిట్లో పెట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఇది మంచి పద్ధతి కాదని సూచించారు. చంద్రబాబు నాయుడు పర్యటన విజయవంతం చేయడానికి కోళ్ళ వర్గం ఒక్కటే కాదని గొంప కృష్ణ వర్గం ఎంత కృషి చేసిందో కార్యకర్తలకు తెలుసన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జితో మండల పార్టీ అధ్యక్షులు సమన్వయంతో పనిచేయాలని, వ్యక్తి గత వివాదాలకు దూరంగా ఉండాలని అధినేత ఆదేశించారని, కానీ ఇన్‌చార్జిదే తుది నిర్ణయమని చెప్పలేదన్నారు. ఆమె తీరు నచ్చక పోవడంతో నియోజకవర్గంలోని 3మండలాల పార్టీ అధ్యక్షులు వ్యతిరేక గళం వినిపించడం జరుగుతోందన్నారు. టిక్కెట్ విషయంలో చంద్రబాబు స్పష్టంగా చెప్పారని, తాను ప్రకటిస్తానని, అంత వరకు మీరు పనిచేసుకోండి అని చెప్పారన్నారు. తప్పుడుగా ప్రచారం చేయడం వలన కార్యకర్తల్లో అనుమానాలు నెలకొంటాయన్నారు. ఎన్నికల సమయంలో టిక్కెట్ కోసం అనేకమంది పోటీ పడడం సహజమని, అందులో టిక్కెట్ వచ్చిన వారికి అందరం కలిసి పనిచేయాలని తెలిపారు. క్లస్టర్ ఇన్‌చార్జిను ఎవరిని సంప్రదించి మార్చారని ప్రశ్నించారు. కార్యకర్తల మధ్య విభేదాలను సృష్టిస్తున్నారని, ఇది పార్టీకి తీరని నష్టం కలిగిస్తుందన్నారు. తను అధికారంలోకి వస్తే గొంపకృష్ణ వర్గం లెక్క తేలుస్తాం అని భయపెట్టే మాటలను మానుకోవాలని, మండలంలో ఎవరు బలమైన, ప్రజాభిమానం ఉన్న నేతలో తెలుసుకోవాలని సూచించారు. సర్పంచ్, ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఇలా ఏ ఎన్నికలలోనూ పోటీ చేయని వారిని వర్గంగా తయారు చేసి మమ్మల్ని అవమాన పర్చడం మర్చిపోమని తెలిపారు. గొంప కృష్ణ రావడంతోనే నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులలో ఉత్సాహం వచ్చిందనే విషయం కార్యకర్తలకు తెలుసన్నారు. ఈసమావేశంలో తెలుగుయువత అధ్యక్షుడు రాయవరపు శంకరరావు, జామి గ్రామ కమిటీ అధ్యక్షుడు వేంద్రపు నాయుడు బాబు, కలగాడ నేత రామకృష్ణ పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు పరిశీలన

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని నీలకంతపురం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు - నేడు పేజ్ -2 పనులను మంగళవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి పట్నాయక్, విద్యాశాఖ అధికారి శ్రీదేవి, ఆర్డబ్ల్యూఎస్ జే.ఈ దేవి పరిశీలించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభం కాకముందే పనులను పూర్తి చేయాలని సూచనలను జారీ చేశారు